అమ్మరూపం.. అపురూపం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో భక్తులు శుక్రవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు.



సంగారెడ్డి: బాలా త్రిపుర సుందరిగా వాసవీమాత



గుమ్మడిదల: గాయత్రీమాతగా భద్రకాళి అమ్మవారు



రాయికోడ్: ముమ్మాదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

జిల్లాకు చేరిన క్రీడా జ్యోతి



క్రీడా జ్యోతితో కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సీఎం కప్ నిర్వహించనున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన క్రీడా జ్యోతి శుక్రవారం జిల్లాకు చేరింది. వికారాబాద్ నుంచి వచ్చిన క్రీడాజ్యోతిని పెద్దాపూర్ వద్ద టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అందుకున్నారు. సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పరమేశం, జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి ఖాసీం బేగ్, సీఎం కప్ కాన్వాయ్ ఇన్‌ఛార్జి మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించండి: కలెక్టర్

సదాశివపేట, జహీరాబాద్, న్యూస్‌టుడే: సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పక్కాగా వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణంలో చేపట్టిన కుటుంబ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఉమ, మేనేజర్ ఉపేందర్‌సింగ్ తదితరులు వెంట ఉన్నారు. కుటుంబ సమాచారాన్ని సేకరిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, సర్వే కార్యక్రమ ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం గౌసాబాద్, జహీరాబాద్ పురపాలిక పరిధిలోని శాంతినగర్(10వ వార్డు)లను సర్వేకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేసినట్లు వివరించారు.

ప్రమాదాల నివారణకు సమన్వయం అవసరం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారుల సమన్వయం అవసరమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

విజయోస్తు ఛాలెంజ్‌తో ముందుకు: ఆర్ఎం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికులను చిరునవ్వుతో పలకరిస్తూ ప్రమాద రహితంగా గమ్య స్థానానికి చేర్చడమే లక్ష్యంగా 'విజయోస్తూ ఛాలెంజ్'తో డ్రైవర్లు, కండక్టర్లు ముందుకు సాగాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం విజయోస్తు ఛాలెంజ్ కార్యక్రమాన్ని డీఎం జాకీర్ హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. దసరా పండగ సందర్భంగా సంస్థకు మెరుగైన ఆదాయం సాధించడంతో పాటు ఇంధన పొదుపుపై దృష్టి సారించాలని సూచించారు. బస్టాండులో శౌచాలయాలు, పరిశుభ్రత పాటిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు.

నల్లవాగును సందర్శించిన ఉగాండా బృందం



జలాశయం వివరాలు వివరిస్తున్న అధికారి

కల్హేర్, సిర్గాపూర్, న్యూస్‌టుడే: సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్‌లో నిర్మించిన నల్లవాగు జలాశయాన్ని శుక్రవారం ఉగాండా బృందం సందర్శించింది. జలాశయం, పరిసరాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ అధికారులు నల్లవాగు ప్రాధాన్యాన్ని వివరించారు. నారాయణఖేడ్ నీటి పారుదలశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌కు ప్రత్యేక చొరవ

ఎక్కువ మంది దరఖాస్తు చేసేలా విద్యాశాఖ ప్రణాళిక

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

- లక్ష్యం: **2,600**
- ఇప్పటి వరకు దరఖాస్తులు: **1325**

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా రూపొందించే కార్యక్రమం ఇన్‌స్పైర్ మనక్. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎంపికయ్యేలా విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇందుకోసం గత నెలలో ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం విధివిధానాలను వివరించారు. తాజాగా రెండో సారి కూడా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అంతర్జాలంలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. గతంలో జాతీయ స్థాయికి వెళ్లిన నమూనాల గైడ్ ఉపాధ్యాయులతో సూచనలు ఇప్పించారు.



6-10 తరగతుల విద్యార్థులకు అవకాశం

ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు ఆ శాఖ కసరత్తు చేస్తోంది. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ఈ ఏడాది రెండు వేలకు పైగా విద్యార్థులు దరఖాస్తు చేసేలా సమాయత్తం చేస్తున్నారు. గతేడాది 1120 మంది విద్యార్థులు ముందుకొచ్చారు. ఇప్పటి వరకు 1325 మంది దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబరు 15వ తేదీ వరకు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేయడానికి గడువు విధించారు. ఏయే ప్రాజెక్టులు సిద్ధం చేసుకోవాలో ముందస్తుగా నిర్ణయించుకోవాలి. వాటికి సంబంధించిన పటాలు తయారు చేయాలి. పూర్తి వివరాలతో అంతర్జాలంలో అప్‌లోడ్ చేయాలి.

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ, జడ్పీ	312	62,124
గురుకులాలు	48	28,241
ఆదర్శ	10	4,312
కస్తూర్బా	20	5,282
ప్రైవేట్	187	92,120

అధికులు ఎంపికవడమే లక్ష్యం

– సిద్ధారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్‌కు ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేయాలి. ఇందుకోసం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎలాంటి సందేహాలు ఉన్నా.. జిల్లా సైన్స్ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చు. ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక కావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.



పూలు పేర్చి.. గౌరమ్మను కొలిచి

సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్.

గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఎస్పీ పుష్పన్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడమే లక్ష్యంగా యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ బృందం పనిచేస్తోందని టాస్క్ ఫోర్స్ డీఎస్పీ పుష్పన్ కుమార్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని మాస్టర్ మైండ్, జాగృతి డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మత్తు వైపు అడుగులు వేయకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం దృష్టి సారించాలని సూచించారు. సదస్సులో యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ బృందం సీఐ రామునాయక్, ఎస్ఐ కాశీనాథ్, శిక్షణ ఎస్ఐ హారిక పాల్గొన్నారు.

'మార్కెట్ విలువ చెల్లిస్తేనే భూములిస్తాం'

హత్నూర, న్యూస్‌టుడే: మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తేనే భూములిస్తామని ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసిత రైతులు రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణానికి తమకు జీవనాధారమైన విలువైన భూముల్ని ఇస్తే.. కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దేవులపల్లి, కాసాల, దౌల్తాబాద్, సికింద్రాపూర్ గ్రామాలకు చెందిన ట్రిబుల్ ఆర్ భూనిర్వాసిత రైతులతో శుక్రవారం రైతు వేదికలో సంగారెడ్డి ఇన్‌ఛార్జి ఆర్డీవో రాజు సమావేశం నిర్వహించారు. మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని, న్యాయం చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు

నేటితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 నిర్వహణలో భాగంగా 1:3 కింద ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నేటితో ముగియనుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డి పట్టణం శాంతి నగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

అటవీ భూమా? ప్రభుత్వ స్థలమా?

పరాధీనమవుతున్నా.. తేల్చని అధికారులు



గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ

జిన్నారం, న్యూస్‌టుడే: జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలో సుమారు రూ. 10 కోట్ల విలువైన రెండెకరాల స్థలముంది. కొన్నేళ్లుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కొన్ని రోజులుగా ఈ స్థలంలో కొందరు పరిశ్రమల ప్రతినిధులు ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. స్థలం ఆక్రమణకు గురవుతోందని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి వెంకట్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రహరీ నిర్మిస్తున్న పరిశ్రమ ప్రతినిధులను స్థలానికి సంబంధించిన పత్రాలు ఇవ్వాలని తాఖీదులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలమా? కాదా..అని తేల్చాలని ఈ నెల 1న జిన్నారం రెవెన్యూ అధికారులకు తెలిపారు. వారు పెద్దగా స్పందించలేదు. పక్కనే కిష్టాయపల్లి అడవులు ఉండటంతో.. ఆ శాఖకు సంబంధించిన స్థలమేమోనని వావిలాల అటవీ సెక్షన్ అధికారిణి షాహీన్ తరుణం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అక్కడి నుంచీ స్పందన కరవైంది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి.. ఏ శాఖకు సంబంధించిన స్థలమో తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనంతగిరి.. చూసి తనివి తీరాల్సిందే!

సెలవుల్లో సందర్శించాల్సిన స్థలం



న్యూస్‌టుడే, వికారాబాద్

ఆ మార్గంలో వెళ్తే ప్రకృతి మనల్ని పలకరిస్తుంది.. ఎత్తయిన గుట్టలు.. మయూరాల విన్యాసాలు.. పచ్చని తీగె జలపాతాలు.. పక్షుల కిలకిలరావాలు.. అనంత పద్మనాభస్వామి ఆలయం.. ఇవన్నీ అనంతగిరి సొంతం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలోని అనంతగిరికి వస్తే సహజసిద్ధ ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు. ఇక్కడి కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటు షికారు చేయొచ్చు. ఇక్కడికొస్తే రోజంతా ఆహ్లాదంగా గడిపేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. మరెందుకు ఆలస్యం.. దసరా సెలవుల్లో అనంతగిరికి వచ్చి ఇక్కడి అందాలను ఆస్వాదించి వద్దాం పదండి.

అనంతగిరి విశేషాలు
విస్తరించిన ప్రాంతం 3750 ఎకరాలు
వన్య ప్రాణులు 16
పక్షులు 75
ఔషధ వృక్షాలు 307

వికారాబాద్‌ను ఆనుకొని వేలాది ఎకరాల్లో విస్తరించిన అనంతగిరి అటవీ ప్రాంతంలోని ఔషధ మొక్కలను గుర్తించిన అప్పటి నిజాం ఏడో నవాబు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ ఛాతీ వైద్య ఆసుపత్రి (క్షయ చికిత్సాలయం) నిర్మించారు. ఇక్కడికి సమీప పట్టణాలు, గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం బీదర్, గుల్బర్గాకు చెందిన క్షయ పీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఎన్నో రకాల పక్షులు, వన్యప్రాణులకు ఈ ప్రాంతం నెలవైందని తెలిసింది. డెహ్రాడూన్ నుంచి ఔషధ మొక్కలు తీసుకొచ్చి అనంతగిరిలో నాటి ఔషధ వనం రూపొందించడానికి కృషి జరుగుతోంది.

ఔషధ మొక్కల సంరక్షణ

అటవీ ప్రాంతంలోని మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలు నాటారు. వాటికి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అనువైన ప్రదేశాల్లో వేప, జిల్లేడు, నక్కెర, బిల్వేడు, ఉసిరి, మద్ది, మేడి, దంతి, గుంపెన, ఇప్ప, మామిడి, చింత, నల్లజీడి, బిల్ల, తాని, కరక, పాలకొడిశ తదితర ఔషధాలకు చెందిన వాటిని నాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరికి వచ్చిన పర్యాటకులు బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటుంటారు. త్రేతాయుగంలో రాముడు రావణ సంహారం తర్వాత ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగాన్ని అభిషేకించేందుకు రాముడు బాణం వేసి పాతాళగంగను పైకి రప్పించారని ప్రతీతి. గంగ బుడగ రూపంలో రావడంతో బుగ్గ రామలింగేశ్వరుడు అన్న పేరు వచ్చిందని చరిత్ర. ఆలయంలోని నంది నోట్లో నుంచి నిరంతరం నీటి ధార వస్తూనే ఉంటుంది.

ప్రాజెక్టు చెంత

అనంతగిరిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్దకు వెళ్లవచ్చు. వికారాబాద్‌కు 24 కి.మీ. దూరంలో ధారూర్ అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉంది. ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటుంది. బోట్‌లో షికారు చేసే అవకాశం ఉండటంతో అత్యధికులు ఇక్కడికి వస్తుంటారు. దట్టమైన చెట్ల మధ్య పరుచుకున్న ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి తరించాల్సిందే. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సందడిగా ఉంటుంది.

ఔషధ మొక్కల సంరక్షణకు..

ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలున్నాయి. మరిన్ని సంరక్షించేందుకు ప్రణాళికతో అడుగులేస్తున్నాం. అటవీ అభివృద్ధికి అన్ని రకాల కృషి జరుగుతోంది. ఇక్కడికొచ్చే సందర్శకులకు వసతుల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. - జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో



బోటింగ్ షికారు

ప్రతిభ వెలికి తీసేందుకే పోలీసు డ్యూటీ మీట్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని మల్టీజోన్‌-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరం జరిగిన తర్వాత ఆధారాల సేకరణపై జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జోనల్ స్థాయిలో... నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి(ప్రథమ), వికారాబాద్ సీఐ రఘురాం (ద్వితీయ), కొండాపూర్ ఎస్‌ఐ హరిశంకర్ గౌడ్ తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, రామోహన్‌రెడ్డి, నరేందర్, వికారాబాద్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన మల్టీజోన్‌-2 ఐజీ సత్యనారాయణ

అండర్‌-14 క్రికెట్ జట్టు ఎంపిక

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని క్రీడామైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా అండర్‌-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ కార్యదర్శి సౌందర్య వెల్లడించారు. 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్ పోటీలు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: భారతీయ సాంకేతిక సంస్థ-హైదరాబాద్(ఐఐటీహెచ్) రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు, నగరాలకు చెందిన వారిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 1న ఐఐటీ క్యాంపస్ ఆవరణలో ఉదయం 5 గంటలకు 21.1 కి.మీ. హాఫ్ మారథాన్, 10, 5 కి.మీ పరుగు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు https:///www.iithydrun-nersclub.comegistration ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పతకాలు, ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలు.. ఐదు బలవన్మరణాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే రోజు ఐదు ఘటనలు జరగడం.. జిల్లా పోలీసులను ఉలికిపాటుకు గురిచేసింది.

ఆ తల్లి శోకం తీరనిది..



లక్ష్మణ్

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: భర్త దూరం కాగా, ఉన్న ఒక్క కొడుకే తన సర్వస్వం అనుకుంది ఆ తల్లి. ఇంతలో ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెకు తీరని వేదన మిగిలింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అల్లాదుర్గంకు చెందిన లక్ష్మి భర్త నర్సింలు పదేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేస్తూ కుమారుడు లక్ష్మణ్(23)ను పోషించింది. కూలీ పని చేసుకొని దసరాకు దుస్తులు కొనుక్కొని వస్తానని కుమారుడు పది రోజుల క్రితం సంగారెడ్డికి వెళ్లాడు. శుక్రవారం అల్లాదుర్గం శివారులోని పటేల్ చెరువులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు పరిశీలించి.. దుస్తుల ఆధారంగా లక్ష్మణ్‌దని నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భార్య ఆరోగ్యం క్షీణించడంతో..



మహేశ్

చిలప్‌చెడ్: మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌కు చెందిన మహేష్(33), సావిత్రి భార్యాభర్తలు. సావిత్రి ఆరోగ్యం క్షీణించడంతో 15 రోజులుగా పుట్టింట్లో ఉంటోంది. మనస్తాపం చెందిన భర్త శుక్రవారం తన పెద్దన్న యాదయ్య ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సావిత్రి ఫిర్యాదు మేరకు చిలప్‌చెడ్ ఎస్సై యాదగిరి కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..



క్రిష్ణ

కౌడిపల్లి: కౌడిపల్లికి చెందిన బర్ల క్రిష్ణ(44), శోభ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. అతను వ్యవసాయం, సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె వార్డు మాజీ సభ్యురాలిగా పనిచేశారు. ఒక కుమార్తెకు పెళ్లి చేశారు. వివిధ అవసరాలకు చేసిన అప్పులు తీరక క్రిష్ణ సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. భార్య శోభ ఫిర్యాదుతో ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కుమారుడు లేకపోవడంతో తల్లి లచ్చమ్మ అంత్యక్రియలు చేసింది.

ఇంటికి చేసిన అప్పు భారమై..



మహేష్

కొండపాక గ్రామీణం: కొండపాకకు చెందిన శ్రీరాం మహేష్(38), రమ దంపతులకు ఒక కుమార్తె ఉంది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల రూ.3 లక్షలు అప్పు చేసి కొత్తింటిని నిర్మించుకున్నారు. 15 రోజుల క్రితమే గృహప్రవేశం చేశారు. చేసిన అప్పు తీర్చే విషయంలో మనస్తాపం చెందిన మహేష్ శుక్రవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రమ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

భూవివాదంతో మనస్తాపం చెంది..



అశోక్

రామాయంపేట: ఎకరం భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌కు చెందిన ఎర్ర అశోక్(38)కు దాయాదులకు సుమారు ఎకరా భూమి విషయమై కొంత కాలంగా వివాదం నెలకొంది. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. మనస్తాపం చెందిన అశోక్ తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించమని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భూ వివాదంతోనే తన భర్తను చంపారని భార్య బాబాయి ఆరోపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందించడమే లక్ష్యం

ములుగు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలపై చేసిన పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పరిపాలన విభాగం కార్యాలయంలో వర్సిటీ, వీవీయో గ్లోబల్ సంస్థల మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. వీవీయో గ్లోబల్ సంస్థ.. దక్షిణ కొరియా దేశానికి చెందిన పలు సంస్థలతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, విజయ, సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



పత్రాలు మార్చుకుంటున్న నీరజ ప్రభాకర్, వీవీయో గ్లోబల్ సంస్థ ప్రతినిధులు

ఉపాధ్యాయుల కృషితోనే బడుల పరిరక్షణ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యుటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సంఘం జిల్లా స్థాయి అధ్యయన తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ రకాల కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోందన్నారు. సర్కారు పాఠశాలల పరిరక్షణకు ప్రతి యుటీఎఫ్ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యారంగ పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్, కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

మలుపులో ఢీకొన్న బస్సు, కారు

ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు

కల్హేర్, న్యూస్‌టుడే: మలుపు వద్ద ఆర్టీసీ బస్సు-కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. రేగోడు మండలం గజ్వాడలోని ఒకే కుటుంబానికి చెందిన భూమవ్వ(55), పాపయ్య, దుర్గయ్య, స్వరూప, రుత్వి, పుంతి హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం తిరుగు పయనమయ్యారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో భూమవ్వ(55) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త పాపయ్య, కుమారుడు దుర్గయ్య, కోడలు స్వరూపలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్సులో నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారి పరిస్థితి విషమంగా ఉండటంతో పాపయ్య, స్వరూపను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎస్సై పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బైక్ అదుపుతప్పి యువకుడు..



జావిద్

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట ఠాణా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై అరవింద్ తెలిపిన ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం కటికే గేరికి చెందిన మహ్మమద్ పాషమియా, ఫర్జాన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్నకుమారుడు మహ్మమద్ జావీద్(24), అతని మిత్రుడు మఫాజ్‌పటేల్‌తో కలిసి గురువారం కోట్‌పల్లికి వెళ్లారు. అదే రోజు రాత్రి సదాశివపేటకు తిరిగి వస్తుండగా, మండల పరిధి మోరంగపల్లి శివారులో రోడ్డుపై గుంత ఉండడంతో, వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. జావిద్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మఫాజ్‌కు గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి గాంధీకి తరలించారు. శుక్రవారం జావీద్ అన్న హనీఫ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వివరించారు.

సర్పం.. స్నేహపూర్వకం



పాములు.. రైతులకు, వన్యప్రాణుల సమతుల్యానికి స్నేహకారకమయ్యేవి. అన్ని పాములూ విషపూరితమైనవి కావు. వీటి అవగాహన కోసం 70వ 'వన్యప్రాణి వారోత్సవాలు' పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రాకేశ్ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ సిబ్బందికి సర్పాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్య, అటవీశాఖ క్షేత్ర అధికారి ఇక్రముద్దీన్, దుబ్బాక రేంజ్ అధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టడే, సిద్దిపేట టౌన్

ఈఎస్‌ఐ ఆసుపత్రికి రెండోసారి తాళం

తూప్రాన్, న్యూస్‌టుడే: పుర పరిధి పోతురాజుపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్‌ఐ ఆసుపత్రికి యజమాని తాళం వేయడంతో సేవలు నిలిచిపోయాయి. పది నెలలకు సంబంధించిన అద్దె బకాయిలు రాకపోవడంతో గత ఏప్రిల్‌లో తాళం వేశాడు. అప్పుడు బకాయిలు చెల్లించి తాళం తీయించారు. పుర పరిధిలోకి మారాక దాని ప్రకారం అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ మరోసారి శుక్రవారం తాళం వేశాడు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు సాయిభరత్‌ను వివరణ కోరగా.. అద్దె పెంచాలని కోరుతూ యజమాని తాళం వేశాడన్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



నలుగురు దొంగల రిమాండ్

చేగుంట, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేస్తూ అందులో నుంచి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపారు. హరియాణకు చెందిన జుబేర్‌ఖాన్, ఇర్షాద్, రాజస్థాన్‌కు చెందిన ఫజార్, జాహిద్‌లు చేగుంట పోలీసుస్టేషన్ పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లిలో విద్యుత్తు నియంత్రికను 15 రోజుల క్రితం ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసి విక్రయించారు. అలాగే గత నెలలో మాసాయిపేటలో జప్తు చేసిన రైస్‌మిల్లులో ఉన్న విద్యుత్తు నియంత్రికలోని కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు కారులో తీసుకెళ్తున్నారు. వడియారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా రెండో చోట్ల చోరీ చేసినట్లు అంగీకరించారు. కారుతో పాటు అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాశకు పోయి.. జైలుపాలు

పురాతన విగ్రహం చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

టేక్మాల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాల్సిన యువకులు అత్యాశకు పోయి జైలుపాలయ్యారు. జైన విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన అనువింద్, జగత్, పెద్దపేటకు చెందిన శుభానంద్, కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన తేజసాయిబాబు, పామర్రుకు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్‌లో బీటెక్ చదివారు. రాత్రికిరాత్రే డబ్బులు సంపాదించాలని యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ఆధారంగా పురాతన దేవాలయాలు గుర్తించారు. వెల్పుగొండలోని గుట్టపై పార్శ్వనాథుని పురాతన విగ్రహం ఉన్న విషయం తెలుసుకున్నారు. జులై 26న ఇక్కడికి చేరుకొని విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో అమ్మలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. విగ్రహాన్ని గ్రామస్థులకు అప్పగించి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేశ్‌లు ఉన్నారు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణతో పాటు గ్రామస్థులు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి డీఎస్పీ, సీఐ, ఎస్సైలను సన్మానించారు.



టేక్మాల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

చేపల వేటకు వెళ్లి యువకుడి దుర్మరణం



మల్ల రాజు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని నర్సాపురానికి చెందిన రెడ్డిమల్ల మల్లవ్వ, శరబంధు దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. గతంలోనే శరబంధు మృతి చెందాడు. మల్లవ్వ కూతురు పెళ్లి చేసింది. కుమారుడు రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కోమటిచెరువు నుంచి బయటకు వచ్చే నీటిలో మంగళవారం గాలం వేశాడు. బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తెల్లవారు జామున నీటిలో రాజు మృతదేహం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఆరేళ్లకు రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం



ఇందిరా గాంధీ స్టేడియంలోని క్రీడా మైదానం

పోటీలో పాల్గొనే వారి వివరాలు
జట్లు: 10 (ఉమ్మడి జిల్లాలు)
వ్యాయామ ఉపాధ్యాయులు: 42
రిఫరీలు: 06
కోచ్‌లు, మేనేజర్లు: 20
క్రీడాకారులు: 180

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు బాక్సింగ్ అకాడమీగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానం.. ఆరేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. 2017-18లో జాతీయ, 2016-17 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఇక్కడే జరిగాయి. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు చొరవతో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు ఆరేళ్ల కిందట మైదానాన్ని మూసేశారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తవగా, దీని మధ్యలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఇందులోనే పోటీలు జరుగనున్నాయి. స్టేడియం మొత్తం 7 ఎకరాలలో విస్తరించి ఉండగా, ఇక్కడ నిర్మించి గ్యాలరీలో 20 వేల మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు.

మూడు రోజులు

ఎస్జీఎఫ్ అండర్‌-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగనున్నాయి. ఇందిరాగాంధీ మైదానంతో పాటు వెస్లీ పాఠశాల మైదానంలోనూ పోటీలు జరుగనున్నాయి. మొత్తం 24 మ్యాచ్‌లు జరుగుతాయి. స్థానిక టీజీ ఆర్‌ఎస్ పాఠశాలలో క్రీడాకారిణులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

- రాష్ట్రంలో పచ్చికతో కూడి ఉన్న ఏకైక స్టేడియం మెదక్‌దే కావడం విశేషం. 110 మీ. పొడవు, 70 మీ. వెడల్పుతో విస్తరించి ఉంది. జాతీయ స్థాయి పోటీలు పచ్చిక మైదానాల్లోనే కొనసాగుతాయి.

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్

అన్ని ఏర్పాట్లు పూర్తి..: నాగరాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి



క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆరేళ్ల తర్వాత తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలు జిల్లాలో జరుగుతున్నాయి. ప్రశాంతంగా పూర్తిచేసేలా, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరం కలిసి కృషి చేస్తున్నాం.

పండగల వేళ రైట్.. రైట్

- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రద్దీకి అనుగుణంగా నడిపేందుకు కార్యాచరణ

బతుకమ్మ, దసరా పండగలను అత్యధికులు సొంతూరిలో వేడుక చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో పండగల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది.

ప్రత్యేక సర్వీసులు ఇలా.. (డిపో, బస్సులు)

డిపో	బస్సులు	డిపో	బస్సులు
మెదక్	79	నర్సాపూర్	97
నారాయణఖేడ్	55	సిద్దిపేట	59
సంగారెడ్డి	72	దుబ్బాక	13
జహీరాబాద్	86	పరిగి	16
తాండూరు	10	వికారాబాద్	8
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	39		

రీజియన్ పరిధిలో..

మెదక్ రీజియన్ పరిధిలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 8, రంగారెడ్డి రీజియన్‌లోకి వచ్చే వికారాబాద్ జిల్లాలో మూడు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. పండగల సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా 500 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ప్రత్యేక సర్వీసులు ఈనెల 11 వరకు నడిపిస్తారు.

ఇబ్బంది లేకుండా..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు చెందిన చాలా మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. కొంతమంది అక్కడే స్థిరపడ్డారు. బతుకమ్మ, దసరా పండగలకు వారిలో అత్యధికులు సొంతూరికి వస్తుంటారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించనున్నారు.




- వికారాబాద్ జిల్లాలో పాఠశాలలకు చెందిన 40 బస్సులు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు.

ముందస్తు రిజర్వేషన్‌కు..

దూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తుగా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. ముందస్తు టికెట్ రిజర్వేషన్‌కు www.tsrtconline.in/www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, పరిగి

సద్వినియోగం చేసుకోవాలి: ప్రభులత, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్



బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈమేరకు డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చాం.

కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే తనిఖీ



ఖేడ్‌లో డిజిటల్ కార్డుల సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

నారాయణఖేడ్, జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: ఖేడ్ పురపాలిక పరిధి 3వ వార్డుకు సంబంధించిన మంగల్‌పేటల కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే కొనసాగుతోంది. స్థానిక ఆర్డీవో అశోక చక్రవర్తి, పురపాలిక ఛైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, కమిషనరు జగ్జీవన్ శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. పలు ఇళ్లకు తిరిగి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించి, సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. తహసీల్దారు భాస్కర్, ఉపఛైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ వివేకానంద్ తదితరులున్నారు. జోగిపేట 17 వార్డులో కుటుంబ డిజిటల్ సర్వేలో ఆర్‌డీవో పాండు, మెప్మా పీడీ, మండల ప్రత్యేకాధికారిణి గీతా పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేలో వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. పుర కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్ సత్యనారాయణ, మెప్మా అధికారులు బిక్షపతి, పండరి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల రాణింపు



గెలుపొందిన విద్యార్థులతో అధ్యాపకులు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్ పట్టణంలోని ఈ-తక్షిల పాఠశాల మైదానంలో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలబాలికల షూటింగ్ బాల్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా వాసులు సత్తాచాటారు. ఈ పోటీల్లో 31 జిల్లాల నుంచి బాల బాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో సంగారెడ్డి ప్రథమ, మహబూబాబాద్ జిల్లా ద్వితీయ, గద్వాల జిల్లా తృతీయ, భూపాలపల్లి జిల్లా నాల్గవ స్థానంలో బహుమతులు సాధించాయని పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు మారుతి తెలిపారు. బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా ప్రథమ, మహబూబాబాద్ ద్వితీయ, నల్గొండ తృతీయ, కామారెడ్డి నాల్గవ స్థానంలో నిలిచాయన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ యత్నం

సదాశివపేట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని ముగ్గురు దొంగలు బొలేరో వాహనంలో వచ్చి జాతీయ రహదారి పక్కన ఉన్న షోయల్ కిరాణ దుకాణంలో చోరీ చేసేందుకు షట్టర్ తెరచి లోపలికి వెళ్లారు. దుకాణ యజమాని అర్ధరాత్రి బయటకు వచ్చి చూడగా షట్టర్ కొంత మేర తెరచి ఉండడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు గ్రామస్థులతో కలిసి రాగా దొంగలు పారిపోతుండగా ఒకరిని పట్టుకొని చితకబాదారు. పట్టుబడిన దొంగను పోలీసులకు అప్పగించారు.

రూ.3కోట్లు వ్యయం.. నిర్వహణ శూన్యం

అధ్వానంగా రాజీవ్ పార్కు



పొదల మధ్య ఫౌంటేయిన్



ఓపెన్ జిమ్‌లో పైకి లేచిన బండలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రస్తుతం ఉరుకులు.. పరుగుల జీవితంలో మనిషి శారీరక, మానసిక ఆవేదనకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో వాటి నుంచి బయటపడేందుకు నిత్యం వ్యాయామం, ఆటవిడుపు అవసరం. అందుకోసం ప్రభుత్వాలు పట్టణాల్లో పార్కులు, ఉద్యాన వనాలు ఏర్పాటు చేశాయి. సంగారెడ్డి పట్టణం బొబ్బిలికుంటలో రాజీవ్ పార్కు ఏర్పాటు చేశారు. తొలుత పార్కు బాగానే పని చేసినా నిర్వహణపై దృష్టి సారించక ప్రసుత్తం ఆధ్వాన స్థితికి చేరింది. సెలవు రోజుల్లో ఆట విడుపు కోసం వెళ్లాలన్నా ఉద్యానం కరవైందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పార్కును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గతం ఘనం: ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) నిధుల కింద గత 2013లో రూ.3కోట్ల నిధులతో సంగారెడ్డి పట్టణంలో రాజీవ్‌పార్కును వినియోగంలోకి తీసుకొచ్చారు. అప్పట్లో ఉద్యానంలోకి అడుగు పెడితే చక్కటి వాతావరణం కనిపించేది. పార్కులోనే నడక దారి ఇరువైపులా పచ్చని చెట్లు, మొక్కల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, కల్లు చేదిరేలా ఫౌంటేయిన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 ఏళ్ల లోపు వారికి రూ.5, పెద్దవారికి రూ.10, నెలవారి కార్డు కలిగిన వారికి రూ.250 చొప్పున రుసుము పురపాలిక శాఖ అధికారులు వసూలు చేసేవారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమయం అమలు చేసేవారు.

● గత కొంత కాలంగా పార్కులో నిర్వహణ సరిగా లేక ఫౌంటేన్లు పని చేయకపోవడం, ఆట పరికరాలు తుప్పుపట్టిపోవడంతో పార్కుకు తాళం వేశారు. దీంతో పార్కు అంతా చిట్టడవిలా తయారై కళాహీనంగా మారింది. ఆట పరికరాలు సైతం ధ్వంసమై తుప్పు పట్టాయి. ఇటీవల పార్కుకు తాళం తీశారు. అందులో సగం వరకు పిచ్చి మొక్కలు తొలగించారు. సగం చోట్ల పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. పూర్తిస్థాయిలో శుభ్రత చేయాల్సిన అవసరం ఉంది. పిచ్చిమొక్కల మధ్య విష సర్పాలు సంచరించి కాటేసే ప్రమాదం పొంచి ఉంది. అదే ఆవరణలో మొక్కలు నాటేందుకు తీసుకొచ్చి వదిలేశారు.

రూ.12కోట్లతో అభివృద్ధి చేస్తాం..

రాజీవ్ పార్కును అభివృద్ధి చేసేందుకు రూ.12 కోట్ల నిధులు అవసరం ఉంది. ఇప్పటికే అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేందుకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పార్కు తాళాలు తీసి పిచ్చి మొక్కలు తొలగించాం. ఇతర చోట్ల శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఇంతియాజ్ అహ్మద్, డిప్యూటీ ఈఈ, పురపాలిక సంఘం.**

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి అర్బన్, జోగిపేట:

? సంగారెడ్డి పట్టణం చాణక్యపురి కాలనీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. రాత్రిళ్లు తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. - ఉమా మహేశ్వర్, సంగారెడ్డి

✓ పరిశీలించి మ్యాన్‌హోల్స్ పైమూతలు ఏర్పాటు చేయించి ఇబ్బందులు తీరుస్తాం. **-సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు.**

? సంగారెడ్డిలోని ప్రశాంత్ నగర్ సాయిబాబా ఆలయం ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట బయటకు వచ్చేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. **- రాజు, స్థానికుడు**

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా ఏర్పాటు చేయిస్తాం. **- ఇంతియాజ్ అహ్మద్, పురపాలిక డీఈఈ**

? అందోలు గ్రామం పోచమ్మ ఆలయం ముందు రెండేళ్ల క్రితం ఐమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. కొంత కాలం బాగానే పని చేశాయి. ఏడాది వెలగడం లేదు. రాత్రిళ్లు ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. **- సుభాష్, అందోలు.**

✓ వెలగని దీపాలు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేసి, ఇబ్బందులు తీరుస్తాం. **- తిరుపతి, పుర కమిషనర్, అందోలు- జోగిపేట.**

? అందోలు మండలం సంగుపేట నుంచి పుల్కల్ మండలం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- మొగులయ్య, సంగుపేట.**

✓ రహదారి నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం తగు చర్యలు చేపడతాం. **- రవీందర్, డిప్యూటీ ఈఈ, ర.భ.శాఖ, అందోలు.**

? సంగారెడ్డి పట్టణం రాజంపేటలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలి. **- కిరణ్, రాజంపేట**

✓ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించేలా తగిన చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్ చౌహాన్, కమిషనర్, పురపాలక సంఘం, సంగారెడ్డి.

గాయత్రీమాతగా దుర్గమ్మ



ఐడీఏ బొల్లారంలో



బోరంచలో

దసరా నవరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా కొనసాగతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రిదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. మంగల్‌పేటలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐడీఏ బొల్లారం, వట్‌పల్లి, మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో మండపాల వద్ద భక్తులు భజన, కీర్తనలతో ఆలపించారు. **- న్యూస్‌టుడే, బృందం.**

సందడిగా బతుకమ్మ సంబురం

సదాశివపేట, గుమ్మడిదల, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబురాలు ఊరూరా ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సదాశివపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో గుమ్మడిదలలోని ఓ ఫార్మా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ ఆడారు.



దోమడుగులో బతుకమ్మ ఆడుతూ..



సదాశివపేటలో విద్యార్థులు, అధ్యాపకుల సందడి

సేవాశ్రమాన్ని సందర్శించిన న్యాయసేవా సంస్థ కార్యదర్శి



సేవాశ్రమంలో జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ కార్యదర్శి రమేష్

గుమ్మడిదల, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ శుక్రవారం అన్నారం గ్రామ పరిధిలోని సేవాశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల వివరాలను నిర్వాహకురాలు దుర్గలక్ష్మి వివరించారు. వారి ఆరోగ్యం, ఇతర వివరాలు కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు.

అందరికీ అందుబాటులో డీసీసీబీ సేవలు

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో డీసీసీబీ బ్రాంచుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ మంజూరు లక్ష్యాలను 88శాతం పూర్తి చేసినట్లు డీసీసీబీ ఎంజీఎం శ్రీనివాస్ అన్నారు. వట్‌పల్లి డీసీసీబీ బ్రాంచిని తనిఖీ చేశారు. అనంతరం రూ.72లక్షల రుణాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఖాదీరాబాద్ పీఏసీఎస్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: మండలంలోని చీకుర్తి, హుస్సేనగర్, కాకిజన్వాడ గ్రామాలను ఎంపీడీవో రాజశేఖర్, ఏపీవో సురేష్, ఆకస్మిక తనిఖీలు చేశారు. సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో డంపింగ్‌యార్డులు, పంచాయతీల రికార్డులను పరిశీలించారు.

సమన్యాయం అందించడమే లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సహాయం పొందాలనుకునే వారు టోల్‌ఫ్రీ నంబరు 15100ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందరికీ సమన్యాయం అందాలనే ఉద్దేశంతో ఈ సేవలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుమ్మడిదల, న్యూస్‌టుడే: గుమ్మడిదల కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. ధర్మకర్త నరసింహాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడికి ఎమ్మెల్యే చేయూత

గుమ్మడిదల, న్యూస్‌టుడే: ప్రమాదంలో సర్వం కోల్పోయిన యువకుడికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఉపాధి కల్పించారు. దోమడుగు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో నష్టపోయిన విషయాన్ని తెలుసుకుని ఎమ్మెల్యే ఆటోను కొనుగోలు చేసి శుక్రవారం బాధితుడికి అందచేశారు.

దివ్యాంగులకు వితరణ

కల్హేర్: దివ్యాంగులు సంతోషంగా పండుగను జరుపుకునేందుకు ఉచితంగా బలవర్ధక ఆహారం, దుస్తులు అందజేసినట్లు జీవోదయ సంస్థ డైరెక్టర్లు అన్నారు. శుక్రవారం నిజాంపేట్ జీవోదయ పాఠశాల ఆధ్వర్యంలో 55మందికి దివ్యాంగులకు దుస్తులు అందించారు.

సార్వత్రిక విద్య పరీక్ష కేంద్రాల తనిఖీ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సార్వత్రిక పది, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట సార్వత్రిక విద్య సమన్వయకర్త వెంకటస్వామి ఉన్నారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని శనివారం నుంచి ఈ నెల 14వ వరకు సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు, లింగంపల్లి, సంగారెడ్డి, జోగిపేట, పెద్దశంకరంపేట, నిజాంపేటల మీదుగా ఖేడ్‌కు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు.

సీఐటీయూతోనే కార్మిక సంక్షేమం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కార్మిక సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. జహీరాబాద్ మండలం బూచినెల్లి పారిశ్రామికవాడలోని మహీంద్రా సీఐఈ పరిశ్రమ గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన వేతన ఒప్పందం, తాత్కాలిక కార్మికుల క్రమబద్ధీకరణ సాధిస్తామని హామీ ఇచ్చారు. హక్కుల సాధన కోసం కార్మిక ఎన్నికల్లో సంఘాన్ని గెలిపించుకోవాలని కోరారు. నాయకులు మహిపాల్, సందీప్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.

బతుకమ్మ ఘాట్ పరిశీలన

ఐడీఏ బొల్లారం, (జిన్నారం) న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం కుడికుంటలో నిర్మిస్తున్న బతుకమ్మ ఘాట్ పనులను శుక్రవారం పురపాలిక అధ్యక్షురాలు కె.రోజారాణి పరిశీలించారు. పనులు వేగంగా, నాణ్యతతో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ పండుగ నాటికి ఘాట్‌తో పాటు ఆడుకోవటానికి స్థలాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. 3, 22 వార్డుల్లో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఏఈ కిష్టయ్య, కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, సాయికిరణ్‌రెడ్డి ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు



వంట గ్యాస్ రాయితీ పత్రాలు అందజేస్తున్న నిర్మలారెడ్డి, చింతా ప్రభాకర్

సదాశివపేట, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి వంట గ్యాస్ రాయితీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ గడీల రాంరెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షురాలు అపర్ణపాటిల్, ఉపాధ్యక్షుడు చింతాగోపాల్, మున్సిపల్ కమిషనర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

గుమ్మడిదల: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక వృద్ధి సాధించేందుకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాబార్డు డీడీఎం నిఖిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వీరారెడ్డిపల్లిలో మగ్గం పనిలో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం శివకుమార్, డీసీసీబీ క్షేత్ర సహాయకుడు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

ఐడీఏ బొల్లారం, (జిన్నారం): ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ అనుమతి లేని నిర్మాణాలు చేస్తుందని వెంటనే కట్టడి చేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులు తక్షణం స్పందించాలని కోరారు. కొన్ని పరిశ్రమల తీరుతో అటు హెచ్‌ఎండీఏ, ఇటు పురపాలిక ఆదాయాన్ని

గిరిజనులకు అండగా ప్రభుత్వం: కాంగ్రెస్



పూజల్లో పాల్గొన్న సురేష్‌షెట్కార్, సంజీవరెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ హయాం నుంచి నేటికి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అండగా ఉందని జహీరాబాదు ఎంపీ సురేష్‌షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మండలం వెంకటాపూర్ రాంరావు మహారాజ్ ట్రస్టు కుటీరంలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో భోగ్ భండార్, సేవాలాల్ జెండావిష్కరణ, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో గిరిజనులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని గుర్తుచేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: సంజీవరెడ్డి

మనూరు: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మనూరు వ్యవసాయ గోదాంలో నాఫెడ్ వారి సహకారంతో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ఆశ్రయించకుండా ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులు అమ్మాలని సూచించారు. ఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్, ఏవో మహేష్ చౌహాన్, ఏఈవో సంగమేశ్వర్, డీసీఎంఎస్ ఇన్‌ఛార్జి స్వప్న, నాయకులు సిద్దారెడ్డి, దిగంబర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉన్నారు.

చెరువును పరిశీలించిన శిక్షణ కలెక్టర్ మనోజ్

జోగిపేట: అందోలు మండలం అల్మాయిపేటలో తిరుమలయ్య చెరువుకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా కోళ్ల ఫారాలు నిర్మించారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు శిక్షణ కలెక్టర్ మనోజ్ శుక్రవారం కోళ్ల ఫారాల నిర్మాణ భవనాలతో పాటు, చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ పరిస్థితిపై ఆరా తీశారు. సమగ్ర సమాచారం సేకరించి నివేదికను కలెక్టరుకు అందజేస్తామన్నారు. ఉప తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేష్ కుమార్, నీటిపారుదల శాఖ ఏఈ మజార్, ఎంపీవో అశోక్‌కుమార్ ఉన్నారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి

నారాయణఖేడ్: దుస్తులు ఉతికేందుకు వెళ్లి క్వారీ గోతిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఖేడ్ మండలం హంగర్గా(కె) శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హంగర్గా(కె) శివారులో కంకర క్రషర్ ఉంది. రాళ్ల కోసం పలుచోట్ల తవ్వకాలు చేపట్టగా భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతులు నిండాయి. గ్రామానికి చెందిన చాకలి హన్మంతు(50) గురువారం దుస్తులు ఉతికేందుకు క్వారీ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు గోతిలో పడి గల్లంతయ్యాడు. గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం మృతదేహం నీటిలో తేలింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని ఖేడ్ పోలీసులు తెలిపారు.

డీఎస్సీలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

సంగారెడ్డి అర్బన్: డీఎస్సీ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ తర్వాత స్పందించడం లేదన్నారు. ఈ నెల 9 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

నిర్లక్ష్యపు నీడలో పురపాలిక వాహనాలు



వీధులు శుభ్రం చేసే యంత్రం



మరమ్మతులు చేపట్టని చెత్త సేకరణ వాహనం

న్యూస్‌టుడే, సదాశివపేట: పురపాలిక సంఘంలో ప్రజా అవసరాల కోసం కొనుగోలు చేసిన వాహనాలు, యంత్రాలు పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా మారుతోంది. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పాలక వర్గం ఉదాసీనతకు తోడు నిర్వహణ లోపాలతో కొంత కాలానికే మూలనపడి ఎటూ కాకుండా పోతున్నాయి. సదాశివపేట పురపాలికలో కొన్ని బాగానే పనిచేస్తున్నా వినియోగం లేక, మరికొన్ని మరమ్మతులకు గురై పట్టించుకోక వృథాగా ఉంటున్నాయి. పాతవాటికి మరమ్మతులు చేయించకుండానే అధికారులు కొత్త వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది.

పనిచేస్తున్నవి 14: సదాశివపేట పట్టణంలో 26 వార్డుల్లో చెత్త సేకరించడానికి 21 వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం 14 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో మూలనపడ్డాయి. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. అధికారులు సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో ఉన్నచోటనే మరింత దెబ్బతింటున్నాయి. వాహనాల కొరతతో పట్టణంలో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేయడానికి రూ.35లక్షలతో నాలుగు సంవత్సరాల క్రితం స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఏడాది పాటు బాగానే పనిచేసిన తరువాత మరమ్మతులకు గురికావడంతో అలాగే వదిలేశారు. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరైంది. ప్రస్తుతం ప్రధాన రహదారులను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే వాహనాలు ఉన్నచోటే తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం

దెబ్బతిన్న వాహనాలకు దశల వారిగా మరమ్మతులు చేయిస్తాం. చెత్త సేకరణకు ఎలాంటి సమస్యలు లేవు. ఉన్న వాహనాలతోనే పట్టణంలో ఉదయం, సాయంత్రం చెత్త సేకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. **- ఉమ, మున్సిపల్ కమిషనర్, సదాశివపేట.**